క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు: ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ కార్యదర్శిగా డి. నవీన్‌కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్‌లో రైతు సమస్యలపై తక్షణం స్పందిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సిబ్బంది, మండీ యజమానులు ఆయనను కలిసి అభినందించారు.

ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు చైర్‌పర్సన్‌గా రేణుక



మదనపల్లె సిటీ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కెమిస్ట్రీ అధ్యాపకురాలు డాక్టర్ రేణుకను నియమిస్తూ ఎస్వీయూ వైస్‌చాన్సలర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గత 21 సంవత్సరాలుగా అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. 2004లో బీటీ కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేశారు. ఆమె నియామకంపై కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు అభినందలు తెలిపారు.

పాఠశాలలో విరిగిన చెట్లు


పాఠశాలలో విరిగిన నీలగిరి చెట్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువు పంచాయతీలో ఆదివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, ఈదురు గాలులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మొరుసుపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఎత్తయిన నీలగిరి చెట్లు ఈదురు గాలులకు విరిగి పడ్డాయి. చుట్టుపక్కల ఇళ్లపై, పాఠశాల సమయంలో చెట్లు విరిగిపడి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని ప్రజలు పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు చొరవ చూపి పాఠశాల ఆవరణలో కూలడానికి సిద్ధంగా ఉన్న వృక్షాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హాట్ బాక్సుల వితరణ

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య 30 మంది పేదలకు హాట్ బాక్సులను ఉచితంగా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. నిత్యం స్వామి వారి సేవలో తరిస్తూ సామాజిక, సేవా కార్యక్రమాలు చేస్తున్న పట్టాభి రామయ్యను గ్రామస్తులు కొనియాడారు.

చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటు

మదనపల్లె సిటీ: వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. సోమవారం మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ దిగువగాండ్లపల్లె హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు చంద్రశేఖర్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నిస్సార్‌అహ్మద్ గ్రామానికి వెళ్లి చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పోతబోలు సర్పంచు ఈశ్వరయ్య, లక్ష్మీపతి, సుధాకర్, మోహన్, మల్లికార్జునరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ: తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధిలైట్లు తాగునీటి సమస్యపై ఫిర్యాదు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రమీల, డీఈ, ఆర్ఐ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె సిటీ: రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆవిష్కరించారు. మదనపల్లె సమీపంలోని వశిష్ట పాఠశాలలో ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు రాయలసీమ జిల్లాల షూటింగ్ బాల్ డెవలప్‌మెంట్ కన్వీనర్ నరేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బర్, మైఫోర్సు మహేష్, యూసఫ్ పాల్గొన్నారు.

గొల్లపల్లి వంక భూకబ్జాను అడ్డుకోండి

చీకలబైలు పంచాయతీవాసుల వినతి


గొల్లపల్లి వంక కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న చీకలబైలు పంచాయతీ వాసులు

మదనపల్లె: మండలంలోని చీకలబైలు పంచాయతీ గొల్లపల్లి వంక భూకబ్జాలను అడ్డుకోవాలని కోరుతూ సోమవారం పంచాయతీకి చెందిన వేంపల్లె, బార్లపల్లె, శాస్త్రులగడ్డ, కోళ్లవారిపల్లె గ్రామాల ప్రజలు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో ప్రజా సమస్యపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతులు స్వీకరించారు. మదనపల్లె–బెంగుళూరు జాతీయ రహదారి అనుకుని బాహుదానదిలో కలిసే గొల్లపల్లి వంక బార్లపల్లె గ్రామం ద్వారా 40 అడుగుల విస్తీర్ణంలో ప్రవహిస్తుందన్నారు. గ్రామానికి అనుకుని 20 అడుగుల రోడ్డు ఎన్నో ఏళ్లగా ఉందని, రైతులు ప్రజలు పశువుల కాపరుల ఈ దారిలో పంట పొలాలకు వెళ్లేవారన్నారు. అయితే బార్లపల్లెకు చెందిన షేక్ మస్తాన్ వల్లి, షేక్‌షావల్లి తో పాటు మరికొంత మంది గొల్లపల్లి వంక ప్రవహించే 40 అడుగులు దారి 20 అడుగుల రోడ్డును 2023లో ఆక్రమించగా రెవెన్యూ అధికారులు వచ్చి రోడ్డును పునరుద్ధరించారన్నారు. అయితే తాజాగా ఆదివారం రాత్రి 50 మంది జేసీబీ, ట్రాక్టర్లతో అక్కడికి వచ్చి గొల్లపల్లి వంక, రోడ్డు మూసివేసి సిమెంట్ పెన్సింగ్ వేశారన్నారు. సర్వే నంబర్ 221లో వారికి ఎటువంటి హక్కు లేకపోయినా, నకిలీ పత్రాల, మందిమార్బలంతో ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నిస్తురన్నారు. భూకబ్జా కారణంగా మూడు గ్రామాల్లోని 150 రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా రూ.2 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతమవుతుందన్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

భూమిని ఆన్‌లైన్ చేయండి

బి.కొత్తకోట మండలం టేకులపెంటకు చెందిన వెంకటరమణ భార్య కె.రమాదేవి గట్టు గ్రామంలోని సర్వే నంబర్ 12,18–4 లో 1.68 ఎకరాలు భూమిని డికెటీగా 2000 సంవత్సరంలో మంజూరు చేశారని, అయితే సదరు భూమిని ఆన్‌లైన్ చేయాలని ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా అధికారుల పరిష్కరించలేదని తన భూమిని ఆన్‌లైన్ చేసి వన్‌బి మంజూరు చేయాలని కోరింది.

భూమి పాసుబుక్కులు ఇప్పించండి

మదనపల్లె మండలం ఈశ్వరమ్మకాలనీకి చెందిన రామకృష్ణ భార్య అన్నపూర్ణ తనకు మండలంలోని సర్వే నంబర్ 1180/2లో 5 ఎకరాల భూమిలో 2007లో డీఫారమ్ పట్టా మంజూరు చేయగా సాగు చేసుకుని జీవిస్తున్నామన్నారు. తన భూమిపై సబ్ కలెక్టర్ కోర్టులో కేసు వేయగా 17.6.2023లో వాదనలు పూర్తయినా కాని తన భూమి పాసుపుస్తకాలు అప్పటి వీఆర్‌ఓ నాగేశ్వరరావు తనకు ఇవ్వకుండా ఉంచుకున్నాడన్నారు. సదరు భూమిపై యూనియన్ బ్యాంకులో క్రాప్‌లోను రెన్యూవల్ చేసుకోవడానికి వీలులేకుండా వన్‌బి,అడంగల్ బ్లాక్ లిస్టులో ఉంచారన్నారు. తన సమస్యను పరిష్కరించి పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరింది.

వన్‌బి తొలగించారు

రెవెన్యూ రికార్డుల నుంచి అకారణంగా తన భూమికి సంబంధించిన వన్‌బి తొలగించారని పొన్నూటిపాళెంకు చెందిన రైతు టీ.చంద్రశేఖర్‌రెడ్డి సబ్ కలెక్టర్ వద్ద వాపోయాడు. 2020 వరకు తన భూమి ఆన్‌లైన్‌లో వచ్చేవని, ప్రస్తుతం రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించారని, తాను బైపాస్ సర్జరీ చేసుకున్నాని ఆర్థిక సమస్యలు పరిష్కరించుకునేందుకు భూమి విక్రయించాల్సి ఉండగా వన్‌బి, అడంగల్ వెబ్‌ల్యాండ్‌లో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

హిందూ సమాజంపై దాడులు ఆపండి

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందూ సమాజంపై జరుగుతున్న దాడులు ఆపేలా ప్రభుత్వాన్ని కోరాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు సబ్ కలెక్టర్‌ను కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

కార్పెంటర్లను ఆదుకోండి

బీహార్,యుపి.ఒరిస్సా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల వలస కార్మికుల వల్ల తాము పనులు లేకుండా జీవనోపాధి కోల్పోతున్నామని మదనపల్లె కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సబ్ కలెక్టర్‌కు వినతిచేశారు. సుమారు 400 మంది కార్పెంటర్లు, హెల్పర్లు, తోపడమిషన్లు, వుడ్ పాలిష్ కార్మికులుగా పని చేస్తున్నామని, వలస కార్మికులు అక్రమంగా తమ పనులలో ప్రవేశించి ఉపాధికి గండికొడుతున్నారన్నారు. హార్డ్‌వేర్స్ నడుపుతూ నాణ్యతలేని మెటీరియల్‌ను విక్రయిస్తూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు.

నాణ్యతలేని మాంసం విక్రయాలు, ఆహారపదార్థాలను అడ్డుకోండి

పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యతలేని మాంస ఉత్పత్తులు వినియోగదారులకు అందిస్తున్నారని వాల్మీకి సాధన సమితి నాయకులు నరసింహులు,శ్రీనివాసులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మాంసం విక్రయాలు నాణ్యతలేకపోవడంతో పాటు నిల్వ ఉంచిన మాంసం విక్రయిస్తూ ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. ఎక్కడ పరిశుభ్రత పాటించడం లేదన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారన్నారు. ఈ విషయమై జిల్లాఫుడ్‌సేఫ్టీ అధికారి సమాచారం ఇస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఎంఓ కృష్ణవేణి

కేవీపల్లె : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఏఎంఓ కృష్ణవేణి అన్నారు. సోమవారం ఏపీ మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్షను తనిఖీ చేశారు. పరీక్షా ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం పరీక్షకు 109 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 102 మంది హాజరైనట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలపై ఆరా తీశారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రెడ్డి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కలకడ : ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన అర్హత పరీక్షకు 77 మంది దరఖాస్తు చేయగా 76 మంది హాజరైనట్లు తెలిపారు. మెరిట్ ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ మల్లం గ్షావల్లి తెలిపారు.

73 మంది హాజరు

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. ప్రవేశ పరీక్షకు 73 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ–టూ గౌస్‌పీర్ పర్యవేక్షించారు. ఈ నెల 27న ప్రవేశ పరీక్ష ఫలితాలను వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు.

కార్డుదారులు ఈకేవైసీ పూర్తి చేసుకోండి

– సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్


ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు ఎండీయూ వాహనాలను గ్రామాలకు పంపుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె: రేషన్ కార్డ్ లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద రేషన్ కార్డుదారులు ఈకేవైసీ ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకునేలా గ్రామాలకు ఎండీయూ వాహనాలను పంపుతూ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి డివిజన్ పరిధిలో ఈ కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు 32,000 మంది ఉన్నారన్నారు. మదనపల్లి మండలంలో సుమారు 12000 మంది ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. రేషన్ పంపిణీలో పారదర్శకత తీసుకురావడానికి ఈ కేవైసీ చేస్తున్నామన్నారు. ఈ కేవైసీ పెండింగ్ ఉన్న వారిలో కొంతమంది మరణించి ఉండవచ్చునని మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చునన్నారు. ఎఫ్ పి షాప్ వారీగా ఇన్ని కార్డులు ఉన్నాయి ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారన్న వివరాలను పకడ్బందీగా సేకరిస్తున్నామన్నారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడానికి ఎండీయూ వాహనాలు గ్రామాలకు వెళ్తాయి అన్నారు. ప్రజలు సంబంధిత వీఆర్‌ఓ పంచాయతీ కార్యదర్శి వద్ద కూడా బయోమెట్రిక్ వేసి ఈ కేవైసీ పూర్తి చేయవచ్చున్నారు. ఈకేవైసీ చేయని వారి వివరాలను తొలగించాల్సి వస్తుందన్నారు. ఈ కేవైసీ పెండింగ్ వివరాలను సంబంధిత వీఆర్వోలు ఎఫ్ పి షాప్ డీలర్లకు పంపామన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ లక్ష్మీపురంకు చెందిన వైఎస్సార్ సీపీ వీరాభిమాని, నాయకుడు డి.బాలకృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సోమవారం వారి స్వగృహానికి వెళ్లి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎలాంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువతో సత్కరించారు. ఆయన వెంట సర్పంచ్ శివకుమారి, ఎంపీటీసీ సభ్యులు మహేష్, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కె.ఆర్.మల్లిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు విశ్వనాథరెడ్డి,కి షోర్, జయసింహారెడ్డి , నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

భూ రీసర్వే డీటీగా ప్రసాద్



పీలేరురూరల్ : భూ రీ సర్వే డీటీగా ఎం. ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ భూ సర్వే డీటీగా పని చేస్తున్న సుబ్రమణ్యం కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లో భూ సర్వే డీటీగా పని చేస్తున్న ప్రసాద్ బదిలీపై పీలేరుకు వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ భూ సర్వే కార్యక్రమం వేగవంతం చేస్తామని తెలిపారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

–వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ: అంబేడ్కర్ జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. సోమవారం సాయంత్రం మాలమహానాడు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక మిషన్‌కాం పాండ్ నుంచి పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ప్రపంచం మెచ్చిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో ఉదయ్, కోన భాస్కర్, నారాయణ, యూనస్, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటేష్

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం సర్పంచ్ శివకుమారి, ఎంపీటీసీ సభ్యులు మహేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ వెంకటేష్ రోగులకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు వందమంది వైద్యశిబిరానికి హాజరయ్యారు. ఆపరేషన్లు అవసరం ఉన్నవారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కె.ఆర్.మల్లిరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా నిలుద్దాం

మదనపల్లె: అనాథలకు అందరం అండగా నిలుద్దామని బెంగళూరు చెందిన పిఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ పిసి శివ శంకర్ రెడ్డి, లక్ష్మీ ప్రసన్న దంపతులు అన్నారు. సోమవారం శివ శంకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బసిన కొండ వద్ద ఉన్న కూరపర్తి సాయి చైతన్య అనాథాశ్రమంలో చిన్నారులకు రెండు పూటలా అన్నదానం నిర్వహించారు. సామాజిక బాధ్యతతో చిన్నారులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎండీరవీంద్రారెడ్డి, ఎం యోగానంద రెడ్డి, జి భాను ప్రకాష్ రెడ్డి, చిప్పిలి చిన్న, ప్రవీణ్ రెడ్డి, జస్వంత్ రెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అఖిల భారత మాల సంఘాల జేపీసీ నాయకులు

పీలేరు : దళితుల భూ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు గుర్రం నారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డిపల్లె పంచాయతీ సర్వే నెంబరు 470/1లో ప్రభుత్వ భూమి దూరక్రమణపై ఫిర్యాదు చేయడం జరిగిందని, అయితే పరిష్కారం కాలేదన్నారు. రేగళ్ల పంచాయతీ యల్లంపల్లె హరిజనవాడకు స్మశానవాటిక మంజూరు చేయాలని కోరారు. రేగళ్ల పంచాయతీలో దళితుల పొలాలకు దారి సమస్య, పొలంకు హద్దు, భూముల ఆక్రమణలపై గతంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మాల సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు గుండ్లూరు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివనందన్, నాయకులు నక్క వెంకటరమణ, మల్లికార్జున, నారాయణ, జయరామచంద్రయ్య, రమణ, లోకనాథం, సురేంద్ర, సాయి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె సిటీ: స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం వక్ఫ్ సవరణ కరపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన ముస్లింలు, మహిళలు, యువతకు జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయడానికి వక్ఫ్ చట్టం –2025 ప్రధాని మోదీ తీసుకురావడం జరిగిందన్నారు. వక్ఫ్ కేంద్ర,రాష్ట్ర బోర్డులలో ఇకపై తప్పనిసరిగా ముస్లిం మహిళలకు బలహీనవర్గ ముస్లింలకు చోటు దక్కుతుందని, ఈ విధంగా చట్ట సరవణ చేశారన్నారు. వక్ఫ్ చట్టం 2025పై అన్ని వర్గాల ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కలిగించటానికి జాతీయ స్థాయిలో కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు షబ్బీర్ అహ్మద్, ఆకుల కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డి పిల్లస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత మృతి కేసులో న్యాయం చేయండి

ప్రభుత్వ విప్ ను కలిసిన పొన్నూటిపాలెం రైతులు


ప్రభుత్వ విప్ ను కలిసి తమ సమస్య తెలుపుతున్న పొన్నుటిపాలెం రైతులు

మదనపల్లె: చిరుత మృతి ఘటనలో తమ వారిపై అన్యాయంగా కేసులు పెట్టారని, కేసుల నుంచి తమ వారికి విముక్తి కల్పించి న్యాయం చేయాలని కోరుతూ మదనపల్లి మండలం పొన్నూటిపాలెంకు చెందిన రైతుల కుటుంబ సభ్యులు సోమవారం శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌ను కలిశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లాలని కోరారు. కేవలం చిరుత మృతి చెందిన ప్రదేశానికి సమీపంలో ఉన్న పొలాల రైతులను నేరస్తులుగా పరిగణించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుత మృతిలో తమవారికి ఎటువంటి ప్రేమయం లేకున్నా విచారణ జరపకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా అప్పటికప్పుడు అరెస్టులు చేశారన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమ వారికి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు కుటుంబాలకు హరిప్రసాద్ హామీ ఇస్తూ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంగారపు రంగ చౌదరి, మైఫోర్స్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


కార్మికులకు కోళ్లు పంపిణీ చేసిన నాయకులు

పీలేరు రూరల్ : దాతల సహకారం అభినందనీయమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం పీలేరు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లకు స్థానిక చిత్తూరు రోడ్డుకు చెందిన మనోరెడ్డి ఈస్టర్‌డేని పురస్కరించుకుని తన తల్లిదండ్రులు హేలన్‌కుమారి, నారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 170 మంది కార్మికులకు కోళ్ల పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మనోరెడ్డి ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్మికుల కమిటీ నాయకులను దుశ్శాలువలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ గురుమోహన్, వార్డుమెంబర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనాథరెడ్డి, సాంబశివారెడ్డి, నాగభూషణం, నాగరాజనాయక్, అబీద్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు నారే వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్ : పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన వైఎస్సాసీపీ నాయకుడు షఫీ కుమారుడు వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ ఎస్. అమీన్, ఫర్వీన్‌ల వలీమా కార్యక్రమం స్థానిక ఎంఎం కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ స్కేళ్ల వితరణ


డిజిటల్ స్కేళ్లను అందజేసిన ఫౌండేషన్ సభ్యులతో ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారు సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఫౌండేషన్ జాయింట్ సెక్రటరి మిండిగల్ లక్ష్మణ్, రామాంజులు సహకారంతో కందుకూరు సెక్టార్ పరిధిలోని 48 అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ వెయింగ్ స్కేళ్లను వితరణ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, జయరాణిలతో పాటు పోలీసులు అభినందించారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు


ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రం సెక్టార్ రెడ్డివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు లభించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చౌడసముద్రం, కాలువపల్లె, సోంపల్లె –1, సోంపల్లె –2 పంచాయతీల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించలేదు

మాజీ ఎంపీపీ నక్కాచంద్రశేఖర్

గుర్రంకొండ: మండలంలోని చిట్టిబోయన పల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించలేదని మాజీ ఎంపీపీ నక్కా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టిబోయనపల్లెలో ప్రభుత్వ భూములను ఆక్రమించారని పదేపదే ఆరోపణలు చేయడం తగదన్నారు.చిట్టిబోయనపల్లెలో సర్వేనెంబరు 87/8లో ఉన్న రెండు ఎకరాల భూమిని 2002 జూలై 3 తేదీన నక్కారెడ్డెన్న భార్య నక్కా యశోదమ్మ అదే గ్రామానికి చెందిన ఆవుల నరసింహులు వారి కుమారుల నుంచి రూ. 50 వేలకు కొనుగోలు చేశారన్నారు. ఇందుకు సంబంధించి అప్పట్లో రిజిస్ట్రేషన్‌కూడా జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల్లో తాము కొనుగోలు చేసిన భూములకు సరిహద్దులు కూడా చూపించారన్నారు. అప్పటి నుంచి సదరు భూమిని సాగు చేసుకొంటున్నాని అన్నారు. 2002లో భూమిని కొన్న సమయంలో అప్పట్లో వైఎస్సార్‌సీపీ లేకపోయినా వైఎస్సార్‌సీపీ నాయకులు కబ్జా చేశారని ప్రచారం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

తప్పులతడకగా భూ సర్వే


నిరసన తెలుపుతున్న రైతులు

కురబలకోట: మండలంలోని బ్రాహ్మణ ఒడ్డుపల్లెలో తప్పుల తడకగా భూ రీసర్వే నిర్వహించారని ఆ గ్రామ రైతులు సోమవారం తహసీల్దారు తపస్వినికి వినతి పత్రం ఇచ్చారు. అంతకు ముందు వారు కార్యాలయం బయట నిరసన తెలిపారు. భూములు సబ్ డివిజన్ చేయకుండా సర్వే నిర్వహించడం వల్ల గందరగోళంగా మారిందన్నారు. రైతులు అందుబాటులో లేని సమయంలో రీసర్వే చేశారన్నారు. భూ వివరాలు సరిగ్గా లేవన్నారు. రీసర్వే గ్రామ సభలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సబ్ డివిజన్ గావించి భూ హక్కుల మేరకు ఆన్‌లైన్, పాసుపుస్తకాలు నమోదు చేయవలసిందిగా వారు కోరారు. రైతులు జి. లక్ష్మన్న, కె. చంద్ర, కె. రమణ, పెద్దరెడ్డెప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.